క్లుప్తంగా

పరిటాల, వేములపల్లిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

కంచికచర్ల: మండలంలోని పరిటాల, వేములపల్లి గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహించామని ఎంపీడీఓ కె.శిల్ప శనివారం తెలిపారు. శిబిరంలో చిన్న పిల్లలకు కొత్త ఆధార్ కార్డు నంబర్ నమోదు చేయటం, అడ్రస్‌లో మార్పులున్నట్లయితే సరిచేయటం, ఆధార్ నంబర్‌కు సెల్ ఫోన్ నంబర్ లింక్ చేయటం, పుట్టిన తేదీల్లో తప్పొప్పులను సరిచేయటం, బయో మెట్రిక్‌లో వేలిముద్రలు పడనివారికి తిరిగి అప్‌డేట్ చేయటం వంటివి చేస్తారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు షేక్ మీర్జావలి, సుబ్రహ్మణ్యం, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో శనికి ప్రత్యేక పూజలు



నందిగామ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శనికి తైలాభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

నందిగామ: అమావాస్య, శనివారం కలిసి రావటంతో పలు ఆలయాల్లో శనికి ప్రత్యేక తైలాభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయం, గాంధీ నగర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని నవగ్రహ మండపం వద్ద శనికి ప్రత్యేక తైలాభిషేకాలు నిర్వహించారు. పట్టణ శివారు పల్లగిరి కొండపై ఉన్న నవగ్రహ మండపం వద్ద భక్తులు స్వయంగా అభిషేకాలు నిర్వహించారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

నందిగామ: నేత్ర సంరక్షణపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని న్యాయమూర్తులు వి.శ్రీనివాసరావు, రమణారెడ్డి సూచించారు. నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు భవనాల ప్రాంగణంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు డాక్టర్ నవ్య, కృష్ణచైతన్య 164 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ మానవ శరీరంలో అత్యంత సున్నితమైన కన్ను విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కన్నెకంటి జీవరత్నం, న్యాయవాదులు యర్రంరెడ్డి బాబూరావు, కె.సత్యనారాయణ, మన్నెం నారాయణరావు, బొందలపాటి రామకృష్ణ, రంగారావు, ఎన్.శ్రీరామమూర్తి, మట్టా ప్రసాద్, వి.విజయ్, బి.ఫణికుమార్, దాదాహుస్సేన్, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన స్వరనీరాజనం

విజయవాడ కల్చరల్: సీనియర్ గాయని బాల సరస్వతి సినీ రంగ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ గాయకుడు బాలజీకుమార్ అన్నారు. నగర గాయనీ గాయకుల ఐక్యవేదిక ఆధ్వర్యాన గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద శనివారం కలసిపాడుదాం పేరుతో లావు బాలసరస్వతికి స్వర నీరాజన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న గాయని బాల సరస్వతి అన్నారు. తొలి తరం గాయనిగా ఆమె సినీ రంగ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నట్లు తెలిపారు. వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, సీహెచ్ బాబు పాల్గొన్నారు. వడ్డాది సూర్యకామేశ్వరి, నరసింహాచార్యులు, శ్రీనివాసరావు, దుర్గ, రైల్వే శ్రీనివాస్ పలు చిత్రగీతాలను ఆలపించారు.

25న మెగా లోన్‌మేళా

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన ఈ నెల 25వ తేదీ బుధవారం వేదిక కల్యాణ మండపంలో మెగా లోన్‌మేళా నిర్వహించనున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో అన్ని ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు పాల్గొని అన్ని రకాల రుణాలు మంజూరు చేస్తాయని పేర్కొన్నారు. వివిధ రకాల రుణాలకు రాయితీలు, ప్రభుత్వం నుంచి డాక్యుమెంటేషన్, మార్కెటింగ్ తదితర సహకారాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ అందిస్తుందని తెలిపారు. దీనిలో పాల్గొనేందుకు ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 63059 41717, 80747 30408లో సంప్రదించాలని సూచించారు.

24న వాహనాల బహిరంగ వేలం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విజయవాడ వెస్ట్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 24వ తేదీ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వెస్ట్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. సీతారామపురంలోని వెస్ట్‌స్టేషన్ పరిధిలో ఆ రోజు ఉదయం 9 గంటలకు మొత్తం 5 వాహనాలకు వేలం జరుగుతుందని పేర్కొన్నారు. పాటలో పాల్గొనేవారు టూవీలర్స్‌కు రూ. 5వేలు, త్రీ వీలర్స్‌కు రూ. 10వేల చొప్పున తిరిగే చెల్లించే ఈఎండీ అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు 94409 02455,99595 10446 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కానిస్టేబుల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



డివిజన్ పరిధిలో పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఏసీపీ నాగేశ్వరరెడ్డి



నందిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో కానిస్టేబుల్ పరీక్షకు సిద్ధం చేస్తున్న అధికారులు

ఏసీపీ నాగేశ్వరరెడ్డి

నందిగామ: డివిజన్ పరిధిలోని అన్ని పరీక్ష కేంద్రాలలో ఆదివారం కానిస్టేబుల్ రాత పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు ఏసీపీ నాగేశ్వరరెడ్డి తెలిపారు. కానిస్టేబుల్ ఉద్యోగ ప్రాథమిక పరీక్షల నేపథ్యంలో డివిజన్ పరిధిలోని పరీక్ష కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష రాసే అభ్యర్థులు తప్పనిసరిగా ఉదయం 9 గంటల లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు.పరీక్ష కేంద్రాల వద్ద 144 వ సెక్షన్ అమలులో ఉందన్నారు.ముఖ్యంగా కేంద్రాలకు సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్స్‌ను మూసి వేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కానిస్టేబుల్ రాత పరీక్షలకు పరీక్ష కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం పది గంటల నుంచి పరీక్ష ప్రారంభం కానుంది.

డివిజన్ పరిధిలో మొత్తం 17 సెంటర్లు ఏర్పాటు చేయగా ఆ సెంటర్లలో 9,476 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రాణం విలువైనది.. నిర్లక్ష్యానికి బలిచేయొద్దు

వాక్‌థాన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



రోడ్డు భద్రతా నియమాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా రవాణా శాఖాధికారులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నిర్వహిస్తున్న వాక్‌థాన్ కార్యక్రమాన్ని శనివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారితో కలిసి పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో తిరుగుతూ భద్రతా నియమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రాణం విలువ వెలకట్టలేనిదని నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రాణాలు పోగొట్టుకోవద్దన్నారు. రోడ్డు నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపటం వల్ల ప్రమాదాలను పూర్తిగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరికీ భద్రతా నియమాలను తెలిపేందుకే ప్రభుత్వం రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడుపుతూ సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, ఎంవీఐ రాజు, నగర పంచాయతీ కమిషనర్ జయరాం, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిరుమామిళ్ల చైతన్యకుమార్, ఎస్ఐ పండుదొర, కట్టప్ప, దాస్, పలువురు నాయకులు, వాకర్‌లు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



శిబిరంలో రోగులకు పరీక్షలు

శనగపాడు(పెనుగంచిప్రోలు): గ్రామంలోని ఏసుక్రీస్తు ప్రార్థనామందిరం వద్ద శనివారం అంజలి డెంటల్ క్లినిక్ వారి సహకారంతో తోటపల్లి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 60 మందికి పైగా రోగులకు దంత పరీక్షలు నిర్వహించటంతో పాటు అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో బ్రదర్ సాల్మన్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

డీపీఓ సునీతకు సత్కారం



డీపీఓను సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ తదితరులు

పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి శనివారం వచ్చిన డీపీఓ, డ్వామా పీడీ సునీతను ఎంపీపీ మార్కపూడి గాంధీ ఘనంగా సన్మానించారు. అనంతరం పలు సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, ఏఓ సిద్ధారెడ్డి, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఈఓపీఆర్‌డీ వీరభద్రరావు, గ్రామ కార్యదర్శులు శ్యామ్, సీతారామరెడ్డి, స్వాతి, ఏడుకొండలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ రుణాలను వినియోగించుకోవాలి

వీరులపాడు: రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. అర్హులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉమ్మడి సమన్వయంతో జగనన్న బడుగు వికాస్, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం ద్వారా పేద వర్గాలకు రాయితీపై రుణాలు అందిస్తున్నారన్నారు. అర్హత కలిగిన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఏపీఎం కార్యాలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

రూ.75 లక్షలతో రహదారులకు మరమ్మతులు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను



ఎమ్మెల్యే ఉదయభాను

జగ్గయ్యపేట: నియోజకవర్గంలో పలు గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని తన స్వగృహంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. అందులో భాగంగానే నియోజకవర్గంలోని రహదారుల మరమ్మతులకు రూ.75లక్షలు మంజూరు చేశారన్నారు. పెనుగంచిప్రోలు మండలంలో శివాపురం నుంచి అనిగండ్లపాడు రహదారికి రూ.30లక్షలు, అనిగండ్లపాడు నుంచి గుమ్మడిదుర్రు రహదారికి రూ.15లక్షలు, వత్సవాయి నుంచి వేమవరం రహదారికి రూ.30లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. కొద్ది రోజుల్లో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం నుంచి చిల్లకల్లు వరకు రూ.14 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

సాగునీటి కష్టాలు తొలగించేందుకే జలకళ



బోరు పంపు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: సన్నచిన్నకారు రైతుల సాగు నీటి కష్టాలను తొలగించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జలకళ పథకాన్ని ప్రవేశపెట్టారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని పల్లగిరి గ్రామంలో జలకళ పథకం ద్వారా ఏర్పాటు చేస్తున్న బోరు పంపు పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీడు భూములకు సైతం సాగు నీటిని అందించి సస్యశ్యామలం చేయాలనే తలంపుతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జలకళ పథకాన్ని రూపొందించారని తెలిపారు. ముఖ్యంగా ఐదెకరాలలోపు సాగు భూమి ఉన్న రైతుల పొలాలలో ఉచితంగా బోరు పంపు వేస్తారన్నారు. సన్నచిన్న కారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, సర్పంచ్ రవికిరణ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మానుకొండ కృష్ణారెడ్డి, చిరుమామిళ్ల చైతన్యకుమార్, చాగంటి శ్రీనివాసరెడ్డి, అలీషా, పలువురు రైతులు పాల్గొన్నారు.

• మూగజీవాలకు ఆపద్బాంధవి 1962



మూగ జీవాల కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన 1962 వాహనం



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 108, 104 వాహనాలు ప్రవేశపెట్టి ప్రజల ప్రాణాలను నిలబెడితే...ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలతో పాటు పశువుల ప్రాణాల విలువను కూడా గుర్తించి, వాటి కోసం 1962 వాహనం ప్రవేశపెట్టి వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవకు శ్రీకారం చుట్టారు. ఈ వాహనం ద్వారా నియోజకవర్గంలో నందిగామ డివిజన్ పరిధిలో నల్ల,తెల్ల జాతి పశువుల తో పాటు మేకలు, గొర్రెలు కలిపి మొత్తం 3,49,456 లక్షలు ఉన్నాయి. డివిజన్ పరిధిలో రెండు వాహనాల ద్వారా సిబ్బంది పశువులకు వైద్య సేవలందిస్తున్నారు. వాహనంలో ఒక పశు వైద్యునితో పాటు వెటర్నరీ డిప్లొమా చేసిన సహాయకుడు, డ్రైవర్ కమ్ అటెండర్ ఉంటారు. 20 రకాల పేడ సంబంధిత పరీక్షలతోపాటు 15 రకాల రక్త పరీక్షలు చేసేందుకు అనువైన ప్రయోగశాల వాహనంలోనే అందుబాటులో ఉంటుంది. ఇప్పటి వరకు రెండు నియోజకవర్గాల పరిధిలో సంచార పశు ఆరోగ్య సేవ వాహనాల ద్వారా 1341 పశువులకు వైద్య సేవలందాయి.ముఖ్యంగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న 94 మూగ జీవుల ప్రాణాలను కాపాడారు.

-నందిగామ



1962 వాహనం ద్వారా గ్రామాల్లో పశువులకు సేవలందిస్తున్న పశు వైద్యులు, సిబ్బంది

బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం ఎనలేని కృషి



ప్రభుత్వ విప్ ఉదయభానుని సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘ నాయకులు

జగ్గయ్యపేట: బ్రాహ్మణుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని అయ్యప్పనగర్‌లో గల గాయత్రి కల్యాణవేదికలో నియోజకవర్గ బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఉదయభానుకు ఆత్మీయ అభినందన, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కనీసం ఆదాయం లేని ఆలయాల్లో నిత్య పూజలు జరిగేలా ప్రభుత్వం ధూపదీప నైవేద్య పథకాన్ని మరింత విస్తరించిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాన్ని అమలు చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వైభవం తీసుకువచ్చిందన్నారు. పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అర్చకులకు ఈ పథకం కింద రూ.5వేలు ధూపదీప నైవేద్యం కింద అందిస్తోందన్నారు. అంతేకాకుండా అర్చకులకు సంక్షేమ నిధి ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటోందన్నారు. నియోజకవర్గంలో 11 శిథిలావస్థలో ఉన్న ఆలయాలకు ఈ పథకం వర్తించిందన్నారు. ఇటీవల మున్సిపల్ కోఆప్షన్ సభ్యుని ఎంపికలో కూడా బ్రాహ్మణ వర్గం నుంచి చైతన్యశర్మను ఎంపిక చేశామన్నారు. అనంతరం బ్రాహ్మణ సంఘాల నాయకులు ఉదయభానును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, బ్రాహ్మణ సంఘ నాయకులు జగన్నాథరావు, కేశవరావు, కోటేశ్వరరావు, భరద్వాజ్, కిషోర్, సతీష్, రాంబాబు, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం చేస్తే రికవరీ

- డ్వామా పీడీ సునీత హెచ్చరిక
- పెనుగంచిప్రోలులో సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదికలో డ్వామా పీడీ సునీత, పక్కన విజిలెన్స్ అధికారులు విజయలక్ష్మి, మణికుమార్, ఎంపీడీఓ

పెనుగంచిప్రోలు: నిధులు దుర్వినియోగం చేస్తే సిబ్బంది నుంచి రికవరీ చేస్తామని డ్వామా పీడీ జె.సునీత హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా 2020–21, 2021–22 ఏడాదికి సంబంధించి ఆడిట్ నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్ఏ పనులు, సామాజిక పింఛన్లకు సంబంధించి తనిఖీ బృందం రిసోర్స్ పర్సన్లు సభ ముందు ఉంచారు. 2020–21 ఏడాదికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 904 పనులు రూ.7,68,82,749, పంచాయతీరాజ్‌లో 28 పనులకు గాను రూ.3,17,355, ఆర్‌డబ్ల్యూఎస్ ఒక పనికి రూ.496 ఖర్చు చేసినట్టు నివేదికను సభ ముందుంచారు. 2021–22 ఏడాదికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 943 పనులకు రూ.9,14,32,765, పంచాయతీరాజ్‌లో 39 పనులు రూ.2,83,08,610, ఆర్‌డబ్ల్యూఎస్‌లో 3 పనులకు రూ.4,71,563, ఎస్ఎస్ఏ కింద 2 పనులకు గాను రూ.4,33,857 ఖర్చు చేసినట్టు రిసోర్స్‌పర్సన్లు సభ ముందుంచారు. కార్యక్రమంలో భాగంగా డ్వామా పీడీ జె.సునీత మాట్లాడుతూ నిధులు దుర్వినియోగం జరిగితే సంబంధిత శాఖ సిబ్బంది నుంచి రికవరీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ కె.మణికుమార్, జిల్లా విజిలెన్స్ అధికారులు వి.విజయలక్ష్మి, వి.రత్నప్రతాప్, డీఆర్‌డీఏ డీపీఎం జి.పావని, ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, ఎస్ఆర్‌పీ పి.రవి, ఏఓ సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి



షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న వెంకట కృష్ణప్రసాద్

జగ్గయ్యపేట: క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మునిసిపల్ కౌన్సిలర్, యువ నాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని మునిసిపల్ ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి షటిల్, బ్యాడ్మింటన్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించి వారిని రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శాప్ ఆధ్వర్యంలో పలు క్రీడా పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, దువ్వాల రామకృష్ణ, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, స్పోర్ట్స్ కన్వీనర్ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి



పట్టణంలో ర్యాలీని ప్రారంభిస్తున్న మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

జగ్గయ్యపేట: ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని జగ్గయ్యపేట ప్రాంతీయ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రవికుమార్ అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వారం రోజుల పాటు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు ఈ నియమాలు పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రయాణికులు కూడా రోడ్డు భద్రత అధికారులకు సహకరించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు నడిపే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



గ్రామంలో నిర్మాణాలను పరిశీలించిన అధికారులు

బండిపాలెం(జగ్గయ్యపేట): నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకాలలో భాగంగా గ్రామాల్లో నిర్మాణమవుతున్న జగనన్న గృహాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని ఎంపీడీవో జయచంద్ర అన్నారు. ప్రతి శనివారం ప్రభుత్వం నిర్వహించే హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నిర్మాణంలో ఉన్న గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గృహాల నిర్మాణాలను పూర్తి చేయాలనే సంకల్పంతో ఉందన్నారు. గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులు త్వరితగతిన గృహాలు నిర్మించుకుని గృహప్రవేశాలు చేసుకోవాలన్నారు. కాలనీలో మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు హౌసింగ్, పంచాయతీరాజ్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రాంప్రసాద్, ఏఈ ప్రకాశరావు, గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

25లోపు ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టులు అప్‌లోడ్ చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇన్‌స్పైర్ మనాక్ 2021–22 జిల్లా స్థాయి పోటీలు ఆన్‌లైన్‌లో జరుగుతాయని జిల్లా సైన్స్ అధికారి ఎం. హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి ఎంపికైన 376 ప్రాజెక్టులను ఈనెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్స్ ప్రాజెక్టులు అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివరాలకు 98486 32062, 94408 83861, 73863 11633, 98665 28299 నంబర్లలో సంప్రదించాలని సైన్స్ అధికారి హుస్సేన్ కోరారు.